
సాక్షి
గుంటూరు
మంగళవారం । 14 । మే । 2024



పోలింగ్ బూత్ వద్ద ఉద్రిక్తత

గుంటూరు నేతాజీనగర్‌లోని సాయి ఆదిత్య స్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ శ్రేణులు హల్‌చల్ చేశారు. ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు యత్నించారు. -8లో▸



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 504.80 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 400 క్యూసెక్కులు విడుదలవుతోంది.



సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి వారి కల్యాణోత్సవం సోమవారం వైభవంగా జరిగింది.

న్యూస్‌రీల్

ఓటు వేసిన నగర కమిషనర్



నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్, తూర్పు ఆర్‌ఓ కీర్తి చేకూరి, ఆమె భర్త ఏపీ సీఎఫ్‌ఎస్‌ఎస్ సీఈఓ బి.సునీల్ కుమార్ రెడ్డిలు కలెక్టరేట్ ఎదురుగా ఉన్న ఇరిగేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన 171వ నంబరు పోలింగ్ కేంద్రంలో సోమవారం ఓటు హక్కు వినియోగించుకున్నారు.

పదహారోసారి..

ఓటు హక్కు వినియోగించుకున్న 105 సంవత్సరాల వృద్ధురాలు



ఆళ్ళ కోటిరత్నమ్మ

తాడేపల్లిరూరల్: మంగళగిరి రూరల్ రామచంద్రాపురంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 105 సంవత్సరాల వృద్ధురాలు ఆళ్ల కోటి రత్నమ్మ ఓటు హక్కును వినియోగించుకుంది. ఇప్పటికి 16 సార్లు ఓటు వేసినట్లు ఆమె తెలిపారు.

పోలింగ్ సరళి పరిశీలించిన 'కిలారి'



తెనాలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య సోమవారం నియోజకవర్గంలో పర్యటించారు. రూరల్ మండలం కొలకలూరులో ఓటింగ్ సరళిని పరిశీలించారు. పార్టీ నాయకులతో కలిసి వివరాలను తెలుసుకున్నారు. వీరితో గుంటూరు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ డైరెక్టర్ ప్రసాదం బాలగురవమ్మ, ఎంపీటీసీ కాలిశెట్టి ఫణికుమార్, పినపాటి అనిల్ తదితరులున్నారు.

బిడ్డకు జన్మనిచ్చి.. ఓటు వేయడానికి వచ్చి..

ప్రసవించిన రోజే ఓటు హక్కు వినియోగించుకున్న మహిళ



బాలింత స్వాతి

తాడేపల్లిరూరల్: మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాల మండలంలో బిడ్డకు జన్మనిచ్చిన గంటల వ్యవధిలోనే తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు సోమవారం ఓ మహిళ పోలింగ్ బూత్‌కు వచ్చింది. గుంటూరు జిల్లా, మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాల మండలం, పెరికలపూడి గ్రామానికి చెంది ఖాజ స్వాతి అనే వివాహిత తెనాలిలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రిలో సోమవారం పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. బాలింత అయినప్పటికీ లెక్కచేయకుండా ప్రత్యేక వాహనంలో పెరికలపూడిలోని పోలింగ్ బూత్‌కు వచ్చి తన ఓటు హక్కును వినియోగించుకుంది. ఈ సందర్భంగా స్వాతి మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా తాను ఓటు హక్కు వినియోగించుకుంటున్నానని, పేద ప్రజల సంక్షేమం కొనసాగాలంటే తన ఒక్క ఓటు సైతం అమూల్యమైనదని గుర్తెరిగి, కొంత కష్టమైనా.. ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపింది. స్వాతి ఓటు హక్కు వినియోగించుకోవడంపై అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

ఓటు కోసం కాదు..



తాడేపల్లిరూరల్: ఎన్నికల వేళ క్యూలైన్ చూసి ఓటు హక్కు కోసం నిలబడ్డారంటే పప్పులో కాలు వేసినట్లే. ఎన్నికల సమయం ముగియడంతో బార్‌లు సోమవారం సాయంత్రం తెరుచుకున్నాయి. దాంతో బారుల ముందు ఎక్కడ చూసినా రోడ్డు మీద వరకు మందుబాబులు క్యూ కట్టి.. గంటల తరబడి లైన్‌లో వేచి ఉన్నారు.



గుంటూరు జిల్లాలో ఓటు వేసిన అనంతరం సిరా గుర్తు చూపిస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థులు మంత్రి విడదల రజని, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, మురుగుడు లావణ్య, నూరి ఫాతిమా, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, అంబటి మురళీకృష్ణ, బలసాని కిరణ్‌కుమార్

ఓటెత్తిన చైతన్యం

- ఉదయం ఆరుగంటల నుంచే బారులు తీరిన జనం
- మహిళలు, వృద్ధులే ఎక్కువ
- దొంగ ఓట్లపై తెలుగుదేశం దృష్టి
- గొడవలు సృష్టించే యత్నం...
- పలుచోట్ల ఘర్షణ వాతావరణం
- స్వల్పంగా లాఠీఛార్జి చేసిన పోలీసులు
- తెలుగుదేశానికి మద్దతుగా ఓట్లు వేయించిన టీచర్లు
- పోలింగ్ ముగిసే సమయానికి తుది అంచనా 75.74 శాతం నమోదు
- పలు చోట్ల మొరాయించిన ఈవీఎంలు
- సాయంత్రం 6 గంటల తర్వాత వరుసలో ఉన్నవారికి ఓటువేసే అవకాశం కల్పించిన ఈసీ
- పోలింగ్ తర్వాత ఈవీఎంలను ఏఎన్‌యూ స్ట్రాంగ్ రూంలకు తరలింపు

ప్రజాస్వామ్యంలో అతి ప్రాముఖ్య ఘట్టం జిల్లాలో పండుగలా సాగింది. ఓటేసేందుకు ఊళ్లకు ఊళ్లు, వాడలకు వాడలు తరలివచ్చాయి. వృద్ధులు, దివ్యాంగులు సైతం ఓటు వేసేందుకు ఉత్సాహం చూపారు. గతంలో ఎన్నడూ లేనంతగా తెల్లతెల్లారే పోలింగ్ బూత్‌లకు చేరుకునేందుకు ఓటర్లు పోటీపడ్డారు. ఎండ తీవ్రంగా ఉన్నా.. లెక్క చేయకుండా క్యూలో వేచి ఉండి ఓటు వేశారు. కొన్ని చోట్ల మినహా జిల్లా అంతా పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగింది.



పోటెత్తిన ఓటరు : గుంటూరు ఎస్‌వీఎన్ కాలనీ, చిన్మయ మిషన్ పోలింగ్ కేంద్రం వద్ద భారీ క్యూలైనులో వేచియున్న ఓటర్లు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు జిల్లావ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. చెదురుమదురు ఘటనలు మినహా పూర్తిస్థాయిలో ప్రశాంత వాతావరణంలోనే ఎన్నికలు జరిగాయి. అక్కడక్కడ ఈవీఎంలు మొరాయించాయి. అయితే వాటిని వెంటనే మరమ్మతులు పూర్తిచేసి ఓటింగ్‌కు అనుమతించారు. దీంతో ఎక్కడా ఇబ్బందులు ఎదురుకాలేదు. పోలింగ్ ముగియడంతో ఈవీఎంలలో అభ్యర్థుల భవితవ్యం నిక్షిప్తమైంది.

ఉదయం ఆరు నుంచే బారులు..

ఉదయం ఆరు గంటల నుంచే ఓటర్లు పోలింగ్ బూత్‌ల ముందు బారులు తీరారు. నగరం, గ్రామీణం అన్న తేడా లేకుండా ఓటు వినియోగించుకునేందుకు ఆసక్తి కనపరిచారు. ఉదయాన్నే పోలింగ్ కేంద్రాల వద్దకు ఓటర్లు తరలి వచ్చారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆసక్తి కనపరిచారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6వరకు ప్రక్రియ కొనసాగింది. అప్పటి వరకు క్యూ లైన్లో ఉన్న వారికి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించారు. రాత్రి పది గంటల వరకూ కూడా పోలింగ్ జరుగుతూనే ఉంది. పోలింగ్ పూర్తి అయిన తర్వాత బ్యాలెట్ బాక్సులను లెక్కింపు కేంద్రమైన ఆచార్య నాగార్జున యూనివర్సిటీకి తరలించారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రారంభించి, అదే రోజున ఫలితాలు విడుదల చేస్తారు. జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎన్నికల పరిశీలకులు ఎప్పటికప్పుడు పోలింగ్ ప్రక్రియను పరిశీలిస్తూ ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ వివాదాలు చోటు చేసుకున్న ప్రాంతాలకు స్వయంగా వెళ్లి అక్కడి సమస్యను పరిష్కరించారు.



ఓటు హక్కు వినియోగించుకున్న వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కిలారి రోశయ్య దంపతులు

ఒకట్రెండుచోట్ల మొరాయించిన ఈవీఎంలు

జిల్లాలోని ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ స్థానాలకు సోమవారం ఉదయం ఏడు గంటలకు ప్రారంభం అయినా కొన్ని చోట్ల ఈవీఎంలలో సాంకేతిక సమస్య వల్ల ఆలస్యంగా ప్రారంభం అయ్యింది. జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి వాటిని మార్చడంతో పోలింగ్ ప్రక్రియకు పెద్దగా ఇబ్బందులు ఎదురుకాలేదు. వేసవి కాలం కావడంతో ఎండ భయంతో ఎక్కువ మంది ఉదయం నుంచే క్యూకట్టారు.



మంగళగిరిలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి. జేసీ రాజకుమారి



ఓటు వేసేందుకు వీల్‌చైర్‌లో వస్తున్న వృద్ధుడు

మహిళలతో పాటు వృద్ధులు, విభిన్న ప్రతిభావంతులు సైతం ఇతరుల సహాయంతో పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటును వేశారు. సాయంత్రం ఐదు గంటల నుంచి ఓటర్లు పోటెత్తారు. 2019లో 78.9 శాతం ఓటింగ్ నమోదు కాగా ప్రస్తుతం ఆరు గంటల వరకూ 70.34 నమోదు అయ్యింది.

ఓటింగ్ శాతం నమోదు ఇలా..

ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది

9 గంటలకు	: 6.17 శాతం
11 గంటలకు	: 20.84
1 గంటకు	: 40.10
3 గంటలకు	: 52.15
5 గంటలకు	: 65.37
పోలింగ్ ముగిసే సరికి	: 75.74



ఓటేయాల్సిందే.. ఓటు వేసేందుకు దివ్యాంగుడిని చైర్‌లో తెస్తున్న దృశ్యం



స్ఫూర్తిప్రదాత: ఓటేసిన తొంభై మూడేళ్ల వృద్ధురాలు సుబ్బమ్మ

పోలింగ్ శాతం ఇలా.....

నియోజక వర్గం	2019లో పోలింగ్ శాతం	2024లో పోలింగ్ శాతం
గుంటూరు ఈస్ట్	70.13	70.02
గుంటూరు వెస్ట్	65.68	66.24
తెనాలి	77.27	75.00
పొన్నూరు	82.83	80.07
మంగళగిరి	85.50	79.02
తాడికొండ	88.66	84.39
ప్రత్తిపాడు	84.20	76.82

ఓటు హక్కు వినియోగించుకున్న ఆళ్ల సోదరులు..



ఎంపీ అయోధ్యరామిరెడ్డి



ఎమ్మెల్యే ఆర్కే

పెదకాకాని: ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి పేర్కొన్నారు. మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఆళ్ల అయోధ్యరామిరెడ్డిలు సోమవారం వారి స్వగ్రామమైన పెదకాకానిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటలకే ఎమ్మెల్యే ఆర్కే పోలింగ్ కేంద్రానికి చేరుకుని చిన్ననాటి స్నేహితులను, స్థానికులను పలుకరిస్తూ ముందుకు సాగారు. సుమారు 2 గంటల సమయం పాటు క్యూలైన్‌లో నిలబడి ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలానే రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి పెదకాకానిలోని 35వ పోలింగ్‌బూత్‌లో అసెంబ్లీ, పార్లమెంట్ అభ్యర్థులకు ఓటు వేశారు.

దొంగ ఓట్లపై తెలుగుదేశం దృష్టి..

తెలుగుదేశం నాయకులు పలుచోట్ల దొంగఓట్లు వేసే ప్రయత్నం చేశారు. తమకు ఓట్లు పడవు అనుకున్న ప్రాంతాల్లో అలజడి సృష్టించే ప్రయత్నం చేశారు. పలువురిపై దాడులకు దిగారు.

- తూర్పులో లాలాపేట ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వచ్చిన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి షేక్ నూరి ఫాతిమా, ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫాలపై దాడికి ప్రయత్నించారు.
- సంగడిగుంట చలమయ్య విద్యా సంస్థల ప్రాంగణంలో టీడీపీ నాయకులు దొంగ ఓట్లు వేయడాన్ని నిలదీసిన వైఎస్సార్ సీపీ 14వ వార్డు అధ్యక్షుడు గుదె నాగేశ్వరరావుపై దాడి చేసి తల పగులగొట్టారు.
- పశ్చిమలో కొరిటిపాడు నేతాజీనగర్‌లోని సాయి ఆదిత్య స్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద పలుమార్లు ఘర్షణకు దిగారు. టీడీపీ కార్యకర్తలు ల్యాప్ ట్యాబ్ ద్వారా ఓట్లను మార్ఫింగ్ చేస్తు దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నించడంతో దీన్ని వైఎస్సార్‌సీపీ శ్రేణులు అడ్డుకున్నాయి. విషయం తెలుసుకున్న అభ్యర్థి విడదల రజని, ఎమ్మెల్సీ అప్పిరెడ్డి అక్కడికి చేరుకుని తెలుగుదేశానికి మద్దతుగా ఉన్న ఎస్‌ఐ నాగరాజుపై డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. మళ్లీ వివాదం చెలరేగడంతో ఎస్పీ వచ్చి పరిస్థితిని చక్కదిద్దారు.
- విద్యానగర్‌లోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో కూడా దొంగ ఓట్లు వేస్తున్న మహిళలను స్వయంగా అభ్యర్థిని విడదల రజని పట్టుకుని పోలీసులకు అప్పగించారు.
- ప్రత్తిపాడు యనమదలలో పోలింగ్ అధికారి తెలుగుదేశానికి మద్దతుగా వ్యవహరించడంతో ఏజెంట్లు పోలింగ్ ప్రక్రియను నిలిపివేసి ఆందోళనకు దిగారు. దీంతో అమెను విధుల నుంచి తప్పించారు.
- కొత్తమల్లాయపాలెంలో కూడా ఒక పోలింగ్ అధికారిణి ఓవర్‌యాక్షన్ చేయడంతో అమెను కూడా విధుల నుంచి తప్పించారు.
- మేడికొండూరులో 46, 47, 48 పోలింగ్ బూత్‌ల వద్ద టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఓటు వేసేందుకు వచ్చినవారితో సైకిల్ గుర్తుకు ఓటు వేయాలంటూ ప్రచారం చేశారు. గమనించిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రశ్నించడంతో టీడీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు.
- పెదకాకాని మండలం తక్కెళ్లపాడులో వైఎస్సార్ సీపీ ఎంపీ అభ్యర్థి కిలారి రోశయ్యపైకి తెలుగుదేశం శ్రేణులు దాడికి ప్రయత్నించారు.
- తెనాలిలో అయితానగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి గొట్టిముక్కల సుధాకర్ ఎమ్మెల్యే శివకుమార్‌తో గొడవకు దిగాడు. దీంతో ఇరువురి మధ్య తోపులాట జరిగింది.



గుంటూరు: కొరిటెపాడు ఆర్సీఎం స్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు



గుంటూరులో ఓటరు కార్డులు చూపుతున్న మైనారిటీ మహిళలు



గుంటూరు: ఏటీ అగ్రహారం ఎస్‌కేబీఎం హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద..

- ఓటర్లకు టీడీపీ ప్రలోభాల ఎర
- ల్యాబ్‌ట్యాప్‌లతో ఓట్లు మార్ఫింగ్
- పట్టుకున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు
- నిందితులకు వత్తాసు పలికిన అరండల్‌పేట ఎస్‌ఐ
- బూత్‌వద్దకు చేరుకుని విషయాన్ని డీఎస్పీ దృష్టికి తీసుకెళ్లిన మంత్రి రజిని, అప్పిరెడ్డి

నేతాజీనగర్ పోలింగ్ బూత్ వద్ద ఉద్రిక్తత

లక్ష్మీపురం: గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని కొరిటెపాడు, నేతాజీనగర్‌లో గల సాయి ఆదిత్య స్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద ఉదయం 7 గంటల నుంచే ప్రధాన రహదారి వరకు బారులు తీరారు. ఇదిలా ఉంటే నేతాజీ నగర్ బూత్ ప్రారంభం వద్ద కొంతమంది టీడీపీ శ్రేణులు ఉండి ఓటర్లను పలు రకాలుగా ప్రలోభాలకు గురి చేసేందుకు యత్నించారు. వాటర్ బాటిల్స్, టిఫిన్‌ల పేరుతో తెలుగుదేశం పార్టీ కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం చేయడం ప్రారంభించారు. దీన్ని గమనించిన వైఎస్సార్ సీపీ నాయకులు టీడీపీ శ్రేణులను ప్రశ్నించడంతో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. సమాచారం తెలుసుకున్న అరండల్‌పేట ఎస్‌ఐ నాగరాజు అక్కడకు చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పే యత్నం చేస్తూనే తెలుగుదేశం పార్టీకి మద్దతుగా నిలిచారు. తెలుగుదేశం పార్టీ కరపత్రాలను పంపిణీ చేస్తున్న వైనాన్ని ఎస్‌ఐ నాగరాజుకు తెలియజేసినా పట్టించుకోలేదు. అదే ప్రాంతంలో టీడీపీ కార్యకర్తలు ల్యాప్‌ట్యాప్ ద్వారా ఓట్లను మార్ఫింగ్ చేస్తు దొంగ ఓట్లు వేసేందుకు యత్నిస్తున్నారని చెప్పినా ఎస్‌ఐ పట్టించుకోక పోవడంతో వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, టీడీపీ శ్రేణుల మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు



అరండల్‌పేట ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని వెస్ట్ డీఎస్పీ మహేష్‌కు ఫిర్యాదు చేస్తున్న విడదల రజిని

చేసుకుంది. ల్యాబ్ ట్యాప్‌ను వినియోగిస్తున్న వ్యక్తిని పట్టుకుని నిలదీయడంతో ఆ యువకుడు అక్కడ నుంచి పారిపోయే యత్నం చేశాడు. దీంతో వైఎస్సార్ సీపీ మహిళా కార్యకర్తలు సైతం వెంటాడి అతని వద్దఉన్న ల్యాబ్‌ట్యాప్‌ను లాక్కొని ఆ యువకుడిని పట్టుకుని ఎస్‌ఐ నాగరాజుకు అప్పజెప్పారు. ఎస్‌ఐ నాగరాజు చాకచక్యంగా ఆ యువకుడి పట్టుకునట్లే పట్టుకుని వదిలాశారు. దీన్ని గమనించిన వైఎస్సార్ సీపీ శ్రేణులు ఎస్‌ఐ నాగరాజును నిలదీశారు. కొద్దిసేపు ఆ ప్రాంతం అంతా ఉద్రిక్తత చోటు చేసుకుంది. వైఎస్సార్ సీపీ, టీడీపీ కార్యకర్తలు, స్థానిక వైఎస్సార్ సీపీ కార్పొరేటర్‌ల



ఇరువర్గాలను సముదాయిస్తున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

మధ్య తోపులాట జరిగింది.

విద్యానగర్‌లోని లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లోని పోలింగ్ కేంద్రంలో ఓ వృద్ధురాలి ఓటును ఓ విద్యార్థిని వేసేందుకు ప్రయత్నించగా, వైఎస్సార్ సీపీ అభ్యర్థిని విడదల రజిని స్వయంగా పట్టుకున్నారు. అదే సమయంలో పోలింగ్ బూత్ సందర్శనకు వచ్చిన విడదల రజిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని, రిటర్నింగ్ అధికారికి అప్పగించారు.



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని

పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకున్న విడదల రజిని..

నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి విడదల రజిని, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిలు నేతాజీ నగర్ పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. ల్యాప్‌టాప్ ద్వారా ఓట్లను మార్ఫింగ్ చేస్తున్న వ్యక్తిని ఎస్‌ఐ నాగరాజు వదిలేసిన వైనం, టీడీపీకి పూర్తి మద్దతుగా ఎస్‌ఐ వ్యవహరిస్తున్న తీరు రజిని దృష్టికి



పోలింగ్ కేంద్రం వద్ద మంత్రి రజిని, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, ఏసురత్నం

తీసుకొచ్చారు. దీంతో విడదల రజిని వెస్ట్ డీఎస్పీ మహేష్‌కు ఎస్‌ఐ నాగరాజు వ్యవహారంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని చెప్పారు. బూత్‌లలో పార్టీ శ్రేణులతో మాట్లాడి ఎలాంటి ఆందోళలనకు గురికాకుండా ఓటర్లను సక్రమంగా ఓటింగ్ చేసేలా వహరించాల్సిందిగా కోరారు.

ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలి...

టీడీపీ ఓటమి పాలవుతుందన్న అక్కసుతో ఓటర్లను పలు రకాలు ప్రలోభాలకు గురి చేసేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నించడం సరికాదని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని చెప్పారు. ల్యాబ్‌ట్యాప్‌లు, కరపత్రాలతో బూత్‌ల వద్ద ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తుంటే పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరి కాదన్నారు. ప్రతి బూత్‌వద్ద ఎన్నికలను సజావుగా నిర్వంహించాలని తెలిపారు. నేతాజీ నగర్ ఆదిత్య పబ్లిక్ స్కూల్‌లో మధ్యాహ్నం మరోమారు వివాదం చోటు చేసుకుంది. ఈ బూత్‌లో పోలీసులు పూర్తి వైఫల్యం చెందడంతో సమాచారం తెలుసుకున జిల్లా ఎస్పీ తుషార్ డూడీ సిబ్బందితో చేరుకుని లాఠీచార్జి చేయడంతో ఇరువర్గాలు చెల్లాచెదరు అయ్యారు.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

- బాపట్ల ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించామని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. బాపట్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, మున్సిపల్ హైస్కూల్, సీఎస్ఎస్ఎం ఎం ప్రైమరీ పాఠశాల, వెదుళ్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధి స్వూర్టుపురంలోని ఎస్‌పీ ఎలిమెంటరీ పాఠశాల, వృక్షనగర్‌లోని ఎలిమెంటరీ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాల్ని ఆయన సోమవారం పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చే ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీ చేసి పోలింగ్ కేంద్రం లోపలికి పంపాలని ఆదేశించారు. క్యూలైన్లను సక్రమంగా నిర్వహించాలని, రూట్ మొబైల్ పార్టీలు వారి పరిధిలోని పోలింగ్ కేంద్రాల్ని తరచూ సందర్శించాలని తెలిపారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తితే 'సమర్థ్' మొబైల్ యాప్‌కు స్వయంగా కాల్ చేసి పై అధికారులకు తెలియజేయాలని చెప్పారు. జిల్లావ్యాప్తంగా ఉన్న 1510 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు 3,000 మందికి పైగా సిబ్బందితో అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామని వివరించారు. వీరిలో తొమ్మిది కంపెనీల సాయుధ బలగాలు, 250 మంది తమిళనాడు పోలీసులు ఉన్నారని చెప్పారు.

జనచైతన్య గ్రూప్ సంస్థల డైరెక్టర్ మాదల శకుంతల మృతి

నగరంపాలెం: జనచైతన్య గ్రూపు సంస్థల డైరెక్టర్, వ్యవస్థాపకురాలు మాదల శకుంతల(86) సోమవారం రాజేంద్రనగర్‌లోని నివాసంలో కన్నుమూశారు. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. శకుంతల భర్త దివంగత మాదల భాస్కరరావుకు ఇద్దరు కుమారులు మాదల రత్నగిరిబాబు, మాదల సుధాకర్. జనచైతన్య గ్రూప్ సంస్థలు స్థాపించడంలో, అభివృద్ధి చేయడంలో ఆమె కీలక పాత్ర పోషించారు. రాజేంద్రనగర్‌లోని నివాసంలోని ఆమె పార్థివదేహాన్ని పుర ప్రముఖులు, రాజకీయ నాయకులు సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు స్తంభాలగరువులోని మహా ప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుమారులు మాదల రత్నగిరిబాబు, జనచైతన్య గ్రూప్ సంస్థల చైర్మన్ మాదల సుధాకర్ తెలిపారు. మాదల శకుంతల పెదకాకాని జాతీయ రహదారి పక్కనున్న శంకర కంటి ఆస్పత్రికి విలువైన ఐదెకరాల స్థలాన్ని శ్రీ కంచి కామకోటి ట్రస్ట్‌కు విరాళంగా అందించారు. గుంటూరులో మాదల శకుంతల భాస్కర్ నర్సింగ్ కళాశాలను నిర్మించి నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీకి అప్పగించారు. గుంటూరులో సాయిభాస్కర్ ఆస్పత్రి, శ్రేష్టా ఇన్‌ఫ్రా, శకుంతల ఫైనాన్షియర్స్ సంస్థలను స్థాపించారు. కంచికామకోటి పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న వేద కళాశాలకు ఐదెకరాల స్థలం విరాళంగా అందించారు. పలు ధార్మిక సంస్థలకు విరాళాలు అందించారు.



శకుంతల (ఫైల్)



గుంటూరులో ఓటు హక్కు వినియోగించుకున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి



ఓటు వేసిన గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరి



మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి దంపతులు







మాజేటి గురవయ్య పాఠశాల నుంచి సోమవారం రాత్రి ఈవీఎంలను స్ట్రాంగ్ రూమ్‌కి తరలిస్తున్న ఎన్నికల సిబ్బంది - సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు